సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం ၊ 11 ၊ సెప్టెంబర్ ၊ 2024



విశాఖ ఉక్కు.. మన హక్కు

విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ ఉద్యమం ఉధృతమైంది. ఇందుకోసం కమ్యూనిస్టులు, కార్మిక సంఘాల నాయకులు కదం తొక్కారు. - 8లో



వినాయక వేడుకల్లో అపశ్రుతి

వినాయకుని విగ్రహం వద్ద సరదాగా డ్యాన్స్ చేస్తూ ఓ ఆటో డ్రైవర్ ఉన్నట్లుండి కింద పడి పోయి మృతి చెందిన సంఘటన బి.కొత్తకోట మండలం నాయనిబావిలో జరిగింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.230	రూ.280
రెండోరకం	రూ.140	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 174 మెట్రిక్ టన్నులు



మెరుగైన వైద్య సేవలు అందించాలి

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

పెద్దమండ్యం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. మండలంలో జిల్లా కలెక్టర్ మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఏయే మందులు అందుబాటులో ఉన్నాయనే విషయమై ఆరా తీశారు. డెంగీ, మలేరియా, జ్వరాల నివారణ కోసం తీసుకున్న చర్యలపై విచారించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓపీడీ సేవలు, ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ సేవలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

కట్టపై రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు పంపాలి

గుడిశవారిపల్లెచెరువు కట్టపై రోడ్డు విస్తరణ కోసం ఇరిగేషన్, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు వెంటనే ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సోమవారం రాత్రి వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా ట్రాక్టర్ చెరువులోకి బోల్తా పడి విద్యార్థి మృతి చెందిన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అలాగే పెద్దమండ్యం ప్రాథమిక పాఠశాల, గుడిశవారిపల్లె ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పెద్దమండ్యం 1 అంగన్‌వాడీ కేంద్రం, గుడిశవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. చిన్నారులతో ముచ్చటించిన కలెక్టర్ వారి మాటలకు ముగ్ధులై ప్రతి ఒక్కరికి చాక్లెట్లు పంచిపెట్టారు. కేంద్రాలలో బ్లాక్‌బోర్డు లను ఏర్పాటు చేయాలని, ఇందుకోసం నిధులు అవసరమైతే తమకు నివేదించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, సీడీపీఓ నాగవేణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరిప్రసాద్, హౌసింగ్ ఏఈ సందీప్, ఏపీఎం మధుబాబు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్

చిన్నమండెం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల తనిఖీ

చిన్నమండెం: చిన్నమండెంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను మంగళవారం కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని గట్టుపై కూర్చొని విద్యార్థినులతో మమేకమై చదువుపై వారికి గల ఆసక్తి, పాఠశాలలో విద్యాబోధన తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అమలు చేస్తున్న మెనూ నాణ్యతగా ఉందా లేదా అని ఆరా తీశారు. పాఠశాల ప్రహరీ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకుంటామని, ప్రత్యేక నిధులతో తాగు నీటి కోసం ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని విద్యార్థినులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వై.రమాదేవి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గెస్ట్ టీచర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

గుర్రంకొండ : స్థానిక ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీషు గెస్ట్ టీచర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సాయిశిరీష కోరారు. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల వారు 8712625054 నంబరులో సంప్రదించాలన్నారు.

లైంగిక దాడి కేసులో వ్యక్తి అరెస్ట్

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలో ఇటీవల బాలికపై లైంగిక దాడి చేసిన రాజంపేట టి.అగ్రహారానికి చెందిన గూడూరు శివరాజును మంగళవారం సీఐ హేమసుందర్‌రావు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. శివరాజు మామిడికాయల మండీల వద్ద ఉండి పోలీసులను చూసి పారిపోతుండగా అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. నిందితుడి స్కూటీని స్వాధీన పరుచుకున్నట్లు పేర్కొన్నారు. ఇతనిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసులో పదేళ్లు జైలు

సుండుపల్లె : మండల పరిధి సొంటంవారిపల్లి గ్రామ పంచాయతీలోని కొండల తూర్పు గ్రామంలో గత నెల 20న నల్లపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి దంపతులను కొడవలితో నరికి హత్యాయత్నానికి పాల్పడిన కొండలతూర్పు గ్రామానికి చెందిన గుద్దిటి పవన్ కుమార్(27)పై నేరం రుజువు అయింది. దీంతో రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి పది సంవత్సరాలు జైలుశిక్ష, రూ.1000లు జరిమానా విధించారు. పవన్ కుమార్ గతంలో చోరీలు, హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు.

విశాఖ ఉక్కు.. మన హక్కు



రైల్వేకోడూరులో వామపక్ష నాయకుడిని లాక్కెళ్తున్న పోలీసులు

విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ ఉద్యమం ఉధృతమైంది. ఇందుకోసం కమ్యూనిస్టులు, కార్మిక సంఘాల నాయకులు కదం తొక్కారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనల్లో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున చేపట్టారు. విశాఖ ఉక్కు– ఆంధ్రుల హక్కు అని నినదించారు. ఈ పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించేందుకు చేస్తున్న ప్రయత్నం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పరం కాకుండా అడ్డుకుంటామని కూటమి నేతలు ఎన్నికల సమయంలో హామీలు గుప్పించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు అయినా ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు దిగామన్నారు. రాష్ట్రానికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్ ఆధ్వర్యంలో నడపాలని డిమాండ్ చేశారు.

– రాయచోటి అర్బన్ /మదనపల్లె/రైల్వేకోడూరు అర్బన్/బి.కొత్తకోట/రాజంపేట రూరల్



మదనపల్లెలో రాస్తారోకో



రాయచోటి జాతీయ రహదారిపై బంగ్లా వద్ద..



రాజంపేటలోని జాతీయ రహదారిపై ఆందోళన



బి.కొత్తకోటలో సీపీఐ ధర్నా

లంబోదరుడి లడ్డూ అధరహో

లంబోదరుడి లడ్డూ ప్రసాదానికి యమ డిమాండ్ ఉంది. రూ.లక్షల్లో ధర పలుకుతోంది. వినాయక చవితి ఉత్సవాల్లో నాలుగో రోజైన మంగళవారం భారీగా వేలం పాటలు నిర్వహించారు. పలువురు భక్తులు పోటీపడి దక్కించుకున్నారు. స్వామి వారి ప్రసాదం అందడం తమ అదృష్టంగా భావిస్తున్నామని వారు తెలిపారు. మండపం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తులకు పంపిణీ చేశారు. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో ఈ పరిస్థితి కనిపించడం విశేషం.

లింగిరెడ్డిపల్లెలో రూ.2.35 లక్షలు



ఓబులవారిపల్లె : మండలంలోని చిన్నంపల్లి పంచాయతీ లింగిరెడ్డిపల్లె గ్రామంలో లడ్డూ రూ. 2.35 లక్షలు పలికింది. గ్రామానికి చెందిన చింతరాచపల్లి సుబ్బరాయుడు దక్కించుకున్నారు.

అనంతంపల్లిలో రూ.70 వేలు



పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామంలో గణనాథుని లడ్డూ రూ.70 వేలు పలికింది. అనంతంపల్లి గ్రామానికి చెందిన సూరపురాజు చెంగమ్మ దక్కించుకున్నారు.

సీతారాంపురంలో రూ.1.55 లక్షలు



రాజంపేట రూరల్ : మండలంలోని సీతారాంపురంలో రూ.1.55 లక్షలకు గణేష్ లడ్డూను మల్లు రాజులరెడ్డి దక్కించుకున్నారు. కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

త్రిపురవరంలో రూ.2 లక్షలు



ఖాజీపేట : మండలంలోని త్రిపురవరం గ్రామంలో వినాయక విగ్రహ నిమజ్జనం సందర్భంగా లడ్డూ వేలం పాట జరిగింది. పాలగిరి ఓబుల్‌రెడ్డి రూ.2 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. ఇప్పటి వరకు మండలంలో ఇదే అత్యధిక రేటు కావడం విశేషం.

పెద్దదండ్లూరులో రూ.1.32 లక్షలు



జమ్మలమడుగు : మండల పరిధిలోని పెద్దదండ్లూరులో వినాయకుడి లడ్డూను రూ.లక్షా 32 వేలకు మెరువ బ్రదర్స్, వరప్రసాద్‌రెడ్డి వశం చేసుకున్నారు.

బాటవారిపల్లెలో రూ.75 వేలు



పెద్దమండ్యం : మండలంలోని కలిచెర్ల పంచాయతీ బాటవారిపల్లెలో లడ్డూ రూ.75 వేలకు సానక్కగారి సుధాకరరెడ్డి, మరో చిన్న లడ్డూను యర్రగొర్ల ఓబులేసు రూ.30 వేలకు కైవసం చేసుకున్నారు. అలాగే రెడ్డివారిపల్లె దళితవాడలో శ్రీరాములు రూ.38 వేలకు దక్కించుకున్నారు.

లక్కిరెడ్డిపల్లిలో రూ.70 వేలు



చింతకొమ్మదిన్నె : మండలంలోని లక్కిరెడ్డిపల్లి గ్రామంలో లడ్డుతోపాటు, చెరుకుగడలను రూ.70 వేలకు అదే గ్రామానికి చెందిన బిల్లా రమణ దక్కించుకున్నారు.

ఐదుగురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఐదుగురు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె పంచాయతీ యర్రాతివారిపల్లెకు చెందిన గంగాద్రి భార్య శిరీషా(23) భర్తను వినాయక నిమజ్జనానికి వెళ్లవద్దని వారించింది. ఆమె మాటలను లెక్కచేయకుండా గంగాద్రి నిమజ్జనానికి వెళ్లడంతో మనస్తాపం చెంది సోమవారం రాత్రి పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. మదనపల్లె మండలం నిమ్మనపల్లె రోడ్‌కు చెందిన రెడ్డి(33) కుటుంబ సమస్యలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రామాచార్లపల్లెకు చెందిన చంద్రకళ(46) కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు ప్రయత్నించింది. పట్టణంలోని కదిరిరోడ్డుకు చెందిన లక్ష్మీ(32) కుటుంబ సమస్యలతో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

పొలానికి దారి ఇవ్వలేదని..

నిమ్మనపల్లె : పొలానికి దారి ఇవ్వకుండా దాయాదులు ఇబ్బందులకు గురిచేస్తుండటంతో మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. ముష్టూరు పంచాయతీ చల్లావారిపల్లెకు చెందిన నారాయణ కుమారుడు చంద్రశేఖర్(40)కు గ్రామ సమీపంలో పొలం ఉంది. కొంతకాలం నుంచి ఆ పొలానికి దారి విషయమై దాయాదులతో వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం చంద్రశేఖర్ పొలం వద్ద దారి ఏర్పాటు చేసుకుంటుండగా దాయాదులు అడ్డుచెప్పారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో మనస్తాపం చెందిన చంద్రశేఖర్ ఈగల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

చేనేత, సిల్క్ ఉత్పత్తుల అమ్మకాలకు ప్రోత్సాహం

రాయచోటి (జగదాంబసెంటర్) : చేనేత, సిల్క్ ఉత్పత్తుల అమ్మకాలను ప్రోత్సహించేందుకు చేనేత జౌళి శాఖ మంగళగిరి వారి ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీలలో విజయవాడలోని శేష సాయి కల్యాణ మండపం ఎంజీ రోడ్డులో బయ్యర్స్, సెల్లర్స్ మీట్ నిర్వహిస్తున్నారని అన్నమయ్య జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి యు.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి చేనేత సిల్క్ సహకార సంఘాలు, మాస్టర్ వీవర్స్, చేనేత కళాకారుల ఉత్పత్తులను ప్రదర్శిస్తారన్నారు. వస్త్ర వ్యాపారులు, షాపింగ్ మాల్స్ యజమానులు, టెంపుల్ సప్లయర్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బయ్యర్స్ సెల్లర్స్ మీట్‌ను సందర్శించి మదనపల్లి సిల్క్ శారీస్ ఉత్పత్తులను కొనుగోలు చేసి చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలని కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై కక్ష సాధింపు

– తొలగింపునకు అధికార ప్రయోగం

కలికిరి : మండలంలోని మర్రికుంటపల్లి గ్రామ పంచాయతీ ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ జి.గిరిబాబు తొలగింపు లక్ష్యంగా అధికార పార్టీ నేతలు ప్రయత్నిస్తుండటం గమనార్హం. గత నాలుగు సంవత్సరాలుగా ఫీల్డ్ అసిస్టెంట్ పని చేస్తున్న గిరిబాబును.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి రాజీనామా చేయాలని టీడీపీ నాయకులు ఒత్తిడి చేశారు. మాట వినకపోవడంతో రాజీనామా చేయాలని అధికారులతో చెప్పించారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ హైకోర్టును ఆశ్రయించాడు. చట్టవిరుద్ధంగా ఎటువంటి చర్యలు తీసుకోకూడదని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఎలాగైనా అతన్ని తొలగించి అనుకూలురును నియమించుకోదలచిన కూటమి నేతలు ఫీల్డ్ అసిస్టెంట్ అందుబాటులో ఉండటం లేదని జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా అధికారులు మర్రికుంటపల్లిలో గ్రామసభ నిర్వహించి విచారణ చేశారు.

శోచనీయం

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచే స్థానిక నాయకులు మర్రికుంటపల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌పై కక్షపూరితంగా వ్యవహరించడం దారుణం. ఎలాగైనా ఫీల్డ్ అసిస్టెంట్‌గా తమ వారిని నియమించుకుని అక్రమార్జనకు పాల్పడటానికి.. మరోవ్యక్తి ద్వారా అన ధికారికంగా ఫీల్డ్ అసిస్టెంట్ విధులు నిర్వహింపజేస్తున్నారు. ఎలాంటి అధికారం లేక పోయినా ఓ వ్యక్తి.. ఫీల్డ్ అసిస్టెంట్ హోదాలో సంతకాలు చేసి కూలీల హాజరు నమోదు చేస్తున్నాడు.

– మద్దిరాళ్ళ మల్లికార్జున, మర్రికుంటపల్లి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు

మార్కెట్ యార్డులో అక్రమాలపై ఫిర్యాదు

కలికిరి : కలికిరి మార్కెట్ కమిటీ పరిధిలోని కలికిరి, కలకడ మార్కెట్ యార్డులలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి మంగళవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్లుగా ఒకే అధికారి స్థానచలనం లేకుండా ఉండి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కలికిరి మార్కెట్ యార్డుకు సంబంధించి అద్దె గదుల రెన్యువల్, రైతుల నుంచి రెండు శాతం కమీషన్ వసూలు చేయాల్సి ఉండగా.. 15 నుంచి 20 శాతం వరకు చేస్తున్నారని ఆరోపించారు. కలకడలో మార్కెట్‌లో ఎలాంటి సదుపాయాలు లేకపోయినప్పటికీ ఎక్కువ కమీషన్ వసూలు చేస్తున్నారని రైతులు ఆందోళనలు చేసినా సూపర్ వైజర్ పట్టించుకోవడంలేదన్నారు. కలకడ చెక్‌పోస్ట్ నుంచి కార్యాలయానికి మామూళ్లు వస్తున్నాయని ఆరోపించారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

మదనపల్లె : తమ కుటుంబ సభ్యుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ప్రేమ జంట పోలీసులను ఆశ్రయించిన ఘటన మంగళవారం జరిగింది. మదనపల్లె మండలం బార్లపల్లెకు చెందిన శివారెడ్డి, లక్ష్మీదేవిల కుమారుడు పి.హేమంత్‌రెడ్డి(23) బీటెక్ పూర్తి చేసి బెంగళూరులో సివిల్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం కే.బ్రాహ్మణపల్లె పంచాయతీ ఏ.కొత్తపల్లెకు చెందిన వేమారెడ్డి, శ్రీకళ దంపతుల కుమార్తె కే.ప్రసన్న(22) బీటెక్ పూర్తి చేసి బెంగళూరులో ప్రైవేట్ కంపెనీలో పని చేస్తోంది. మూడేళ్లుగా వారిద్దరూ ప్రేమించుకుంటున్నారు. వీరి వివాహానికి పెద్దలు అంగీకరించరన్న నిర్ణయానికి వచ్చి ఈనెల 9వ తేదీన చిత్తూరు జిల్లా కాణిపాకంలో వివాహం చేసుకున్నారు. అయితే ప్రసన్న కుటుంబ సభ్యులు ప్రేమికులను చంపేస్తామంటూ బెదిరించడంతో మంగళవారం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఇరు కుటుంబాల పెద్దలకు తాలూకా పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు.

భార్య,బిడ్డల అదృశ్యంపై ఫిర్యాదు

వీరబల్లి : మండలంలోని తాటికుంటపల్లి పంచాయతీ షికారుపాలెంకు చెందిన క్రిస్టియన్ అనే వ్యక్తి తన భార్య మేఘమాల, ఇద్దరు బిడ్డలు కనిపించడం లేదంటూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఐదు రోజుల క్రితం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు చుట్టు పక్కల ప్రాంతాలలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ఇంత వరకు కనిపించక పోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు గాయపడి ప్రభుత్వ సర్వజనబోధనాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అమ్మచెరువుమిట్టకు చెందిన వెంకటరమణ(55) స్థానికంగా తోపుడుబండిలో వస్తువులు విక్రయిస్తుంటాడు. మంగళవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంలో నీరుగట్టువారిపల్లె నుంచి వెళుతుండగా, ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. నిమ్మనపల్లె సర్కిల్‌కు చెందిన మంజుసింగ్(40) వ్యక్తిగత పనులపై నిమ్మనపల్లె మండలం దిగువపల్లెకు ద్విచక్రవాహనంలో వెళుతుండగా, మార్గంమధ్యలోని రెడ్డివారిపల్లె వద్ద వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అదేప్రాంతానికి చెందిన భాస్కర్(55) స్థలం విషయంగా ఆక్రమణ చేస్తున్న వారిని అడ్డుకోవడంతో దాడి చేసి గాయపరిచారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ..

రామసముద్రం : రామసముద్రం –చెంబకూరు రోడ్డు మార్గంలోని అమరావతి డిగ్రీ కళాశాల వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బైకిస్టు పెద్దకురప్పల్లె గ్రామానికి చెందిన రామకృష్ణ గాయపడ్డాడు.

వినాయకుని వేడుకల్లో అపశ్రుతి

– డ్యాన్స్ వేస్తూ ఓ వ్యక్తి మృతి




ఆకాష్ మృతదేహం

బి.కొత్తకోట/మదనపల్లె: గణేష్ ఉత్సవాల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. వినాయకుని విగ్రహం వద్ద సరదాగా డాన్స్ చేస్తూ ఓ ఆటో డ్రైవర్ ఉన్నట్లుండి కిందపడిపోయి మృతి చెందిన సంఘటన బి.కొత్తకోట మండలం నాయనిబావిలో మంగళవారం రాత్రి జరిగింది. నాయనిబావికి చెందిన శంకర కుమారుడు ఆకాష్(20) ఇటీవల ఇంటర్మీడియెట్ పూర్తి చేశాడు. తరువాత ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పండుగ రోజున ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద అందరితో కలిసి సరదగా డాన్సు చేస్తూ కిందపడిపోయాడు. స్థానికులు 108 అంబులెన్సులో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు.

నిమజ్జనానికి వెళ్తూ గాయపడ్డ విద్యార్థి

మదనపల్లె : వినాయక విగ్రహ నిమజ్జనానికి వెళుతూ ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. అమ్మచెరువుమిట్టకు చెందిన చేనేత కార్మికుడు శంకరప్ప కుమారుడు హరితేజ(17) ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. వినాయక నిమజ్జనానికి స్థానికులతో కలిసి ట్రాక్టర్‌లో మంగళవారం సాయంత్రం వెళుతుండగా ఆర్.కే.టైల్స్ సమీపంలో వాహనంపై నుంచి హరితేజ జారి కిందపడ్డాడు. ట్రాక్టర్ చక్రం అతడి కాలుపై వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ప్రభుత్వ బోధనాసుపత్రికి తరలించారు.



గాయపడ్డ హరితేజ